ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 20.12.2025 సమయం. 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఆధునిక విద్యకు నైతిక విలువలను జోడించినప్పుడు వికసిత్ భారత్ సాధ్యమవుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.

2. ఉద్యోగులు వ్యక్తిగత పక్షపాతానికీ, రాజకీయాలకు తావు లేకుండా వ్యవహరించాలని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఉద్బోధించారు.

3. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకుంటున్న విధాన నిర్ణయాల కారణంగానే గ్రామాలు అబివృద్ధి చెందుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

4. రాష్ట్రంలో ఈ రోజు, రేపు చలి తీవ్రత మరింత పెరుగుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సూచించింది.

-----------------------

**రాష్ట్రపతి**

కరుణ, సహనం, పరస్పర గౌరవం, సమిష్టి బాధ్యత వంటి విలువలు గతానికి చెందిన సిద్ధాంతాలే కాకుండా, ఆధునిక ప్రపంచం బలంగా, సౌహార్దంగా ఉండేందుకు అవసరమైన మౌలిక ఆధారాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఈ రోజు హైదరాబాద్ గచ్చిబౌలి లో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో నిర్వహించిన "టైమ్‌లెస్ విజ్డమ్ ఆఫ్ భారత్ – శాంతి, ప్రగతికి మార్గం" అనే జాతీయ సదస్సును ప్రారంభించిన సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడారు. అభివృద్ధి చెందిన భారతదేశం సాధించాలంటే ఆధునిక విద్యకు నైతిక విలువల వివేకం, విచాక్షణను,

సృజనాత్మకతకు పర్యావరణ బాధ్యతను అనుసంధానించాలని రాష్ట్రపతి పేర్కొన్నారు. బ్రహ్మకుమారీలు వంటి ఆధ్యాత్మిక సంస్థలు వేగంగా మారుతున్న, అనిశ్చితితో నిండిన కాలంలో సామాజిక సామరస్యం, నైతిక నాయకత్వం, అంతర్గత ధైర్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ముర్ము తెలిపారు. భారతదేశ భవిష్యత్తు తీర్చిదిద్దడంలో యువత నైపుణ్యాలు, పరిజ్ఞానం మాత్రమే కాదు, వారి నిజాయితీ, లక్ష్యం గురించి వారికి కల స్పష్టతపైన కూడా ఆధారపడి ఉంటుందని ద్రౌపది ముర్ము అన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి బ్రహ్మకుమారీల రాష్ట్రవ్యాప్త సేవా కార్యక్రమాలైన Values in Education **, డిజిటల్ వెల్‌నెస్, వయోవృద్ధుల సేవ** ప్రాజెక్టులను ప్రారంభించారు. బ్రహ్మకుమారీ సంస్థతో తనకు లోతైన అనుబంధం ఉందని, సమస్త మానవాళికి సరైన మార్గాన్ని చూపే మార్గదర్శక దీపం ఆధ్యాత్మికతేనని రాష్ట్రపతి అన్నారు.

కార్యక్రమంలో భాగంగా ద్రౌపది ముర్ము మొక్కను నాటారు. ఈ సదస్సులో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, రాష్ట్ర మంత్రి డి. సీతక్క, బ్రహ్మకుమారీల ఆధ్యాత్మిక నాయకులు పాల్గొన్నారు.

**MSM/RNU/HYD**

-------------------------

**ఉప రాష్ట్రపతి**

ఉద్యోగులు వ్యక్తిగత పక్షపాతానికీ, రాజకీయాలకు తావు లేకుండా వ్యవహరించాలని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఉద్బోధించారు. ఉద్యోగ నియామకాల ప్రక్రియ, తీరు రానున్న దశాబ్దాల్లో దేశ భవిష్యత్ ను నిర్ణయిస్తాయని, అందులో ప్రతిభ, సమ్మిళితత్వాలకే పెద్దపేట వేయాలనీ అన్నారు. హైదరాబాద్ లో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మెన్ ల జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో మాట్లాడుతూ... ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత అవసరాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. శక్తిమంతమైనా, బాధ్యతాయుత వ్యక్తులనే ఎంచుకోవాలనీ అన్నారు. పనితీరు అంచనాలు, విజిలెన్స్

సమీక్షలూ ఎప్పుడో ఒకసారి కాకుండా, నిరంతర ప్రక్రియగా కొనసాగాలన్నారు. వికసిత భారత్ సాధనకు సంస్థాగత స్థిరీకరణ అవసరమని ఉపరాష్ట్రపతి వక్కాణించారు.

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ... పోటీ పరీక్షల నిర్వహణకోసం ఎంచుకున్న క్యాలండర్ ను తూచ తప్పక అమలు చేసి, యువత విశ్వాసాన్ని పొందాలని అన్నారు. నియామక ప్రక్రియకు పారదర్శకతే కీలకమన్నారు. పక్షపాతాన్ని అరికట్టటానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు. సామాజిక న్యాయాన్ని కోటా ద్వారా కాకుండా, సమ్మిళిత వృద్ధి కోసం సమాన అవకాశాల ద్వారా సాధించాలని అభిప్రాయపడ్డారు. నియామక ప్రక్రియల్లో జవాబుదారీతనం తో వివాదాలను పరిష్కరించుకోవాలని సూచించారు. అంతకు ముందు UPSC సభ్యులు లెఫ్టినెంట్ జనరల్ రాజ్ శుక్లా మాట్లాడుతూ... యువత విశ్వాసాన్ని పొందాలంటే సివిల్ సర్వీసు నియామకాల ప్రక్రియలో పారదర్శకత అవసరమన్నారు. తెలంగాణా PSC అధ్యక్షులు బుర్ర వెంకటేశం సహా పలువురు చైర్పర్సన్ ను ఈ సందర్భంగా మాట్లాడారు.

**MSL**

---------------------------

**బీజేపీ – కిషన్ రెడ్డి**

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకుంటున్న విధాన నిర్ణయాల కారణంగానే గ్రామాలు అబివృద్ధి చెందుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. వ్యవసాయానికి సంబంధించి పెద్దఎత్తున రాయితీలు అందిస్తుందని, రైతులకు సంవత్సరానికి మూడు విడతలుగా 6 వేల రూపాయల వంతున అందజేస్తుందని అన్నారు. బీజేపీ మద్దతుతో గెలిచిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు ఈ రోజు హైదరాబాద్ లో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు ప్రముఖ సినీనటి ఆమని బీజేపీలో చేరారు. పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ఆమెకు పార్టీ కండువ కప్పి సాధారంగా ఆహ్వానం పలికారు.

**ఎంఎస్ఎల్**

---------------------------

**Christmas**

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో క్రిస్మస్ వేడుకలు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు క్రైస్తవ, మైనారిటీ నాయకులు ఈ వేడుకల్లో పాల్గొంటారు. ఈ వేడుకల నేపథ్యంలో రాత్రి ఎల్బీ స్టేడియం, నాంపల్లి, అబిడ్స్ పరిసర ప్రాంతాల్లో ఈ రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయి.

**డెస్క్**

------------------------

**పీసీసీ**

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో సంఖ్యాబలాన్ని ఆసరాగా చేసుకొని మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం పేరును మార్చిందని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ప్రతిష్ఠాత్మకమైన ఈ పథకం నుంచి గాంధీపేరు తొలగింపు శోచనీయమని అన్నారు. మహాత్మ గాంధీ ఉపాధి హామీ పథకం పేరును కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజివికా మిషన్ గ్రామీణ్ గా మార్చిన విషయం తెలిసిందే. ప్రజలకు ఏడాదికి వంద రోజులు పని కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకానికి బీజేపీ 2014లో అధికారానికి వచ్చిన తరవాత క్రమేణ నిధుల్లో కోత విధిస్తూ వచ్చిందని, ఇప్పుడు పేరు కూడా మారిందని అన్నారు. ఇందుకు నిరసనగా రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నిరసన కార్యక్రమం చేపట్టింది. సికింద్రాబాద్ లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు, అజారుద్దీన్, మాజీ ఎంపీ వి. హనుమంతరావు ఎమ్మెల్యే వెడమా బొజ్జు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**డెస్క్**

-------------------------

**మంత్రి కొండా సురేఖ**

రాష్ట్రంలోని జోగులాంబ, కొండగట్టు, కీసర, ఇతర చారిత్రక దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రతిపాదనలు తయారు చేస్తుందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు. సమ్మక్క జాతర సందర్భంగా  అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు. వచ్చే నెల 13వ తేదీన ప్రారంభం కానున్న ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర ఏర్పాట్లపై మంత్రి ఈ రోజు సమీక్షించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని  అధికారులను ఆదేశించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ఆలయ కమిటీ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**వరంగల్ - పీటీసి**

------------------------

**వాజ్ పేయి విగ్రహం**

మాజీ ప్రధానమంత్రి దివంగత అటల్ బీహార్ వాజ్ పేయి విలువలతో కూడిన రాజకీయాలకు నిదర్శనమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఆయన పదవులకే వన్నె తెచ్చారని, ఎన్నికల్లో ఎన్నిసార్లు విజయం సాధించామనే దాని కంటే ఎంత మంది హృదయాలను గెలిచామన్న దానిని నిరూపించిన మహా నేత అని ఆయన అన్నారు. మోదీ-అటల్ సుపరిపాలన యాత్రలో భాగంగా అటల్ బీహార్ వాజ్ పేయి కాంస్య విగ్రహాన్ని విశాఖపట్నంలో ఆయన ఈ రోజు ఆవిష్కరించారు.

**పీటీసీ - విశాఖపట్నం**

--------------------------

**వనపర్తి జిల్లా**

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈనెల 23వ తేదిన వనపర్తి జిల్లాలో పర్యటిస్తారు. ఆ రోజు సాయంత్రం మూడున్నర గంటలకు ఆయన వనపర్తికి చేరుకుంటారు. వివిధ రంగాలతు

చెందిన ప్రముఖులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారని కలెక్టర్ ఆధర్శ సురభి తెలిపారు.

**పీటీసీ - వనపర్తి**

---------------------------

**మంత్రి జూపల్లి కృష్ణారావు**

పాలమూరు జిల్లాకు చెందిన వీరవనిత హీరిభాయి సాహస జీవితంపై వచ్చిన విరచితమైన పుస్తకాన్ని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ రోజు హైదరాబాద్ లో ఆవిష్కరించారు. నాగర్ కర్నూల్ జిల్లా బిజినెపల్లి మండలానికి చెందిన వెంకట పవార్ రచించిన ఈ పుస్తకాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురించింది. గోరు బంజారీ చరిత్ర తొలిసారిగా నవలగా రావడం హర్షనీయమని మంత్రి ఈ సందర్భంగా అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ బాలాచారి, ట్రైకార చైర్మన్ డాక్టర్ తేజావత్ బెల్లయ్య నాయక్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**పీటీసీ – నాగర్ కర్నూల్**

---------------------------

**బీఆర్ఎస్**

భారత రాష్ట్ర సమితి పార్టీ శాసనసభాపక్షం, రాష్ట్రకార్యవర్గ సమావేశం రేపు పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్ లో జరుగుతుంది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.. చంద్రశేఖర్ రావు అధ్యక్షతన జరిగే సమావేశంలో, రాష్ట్రంలో నదీ జలాలు, సాగునీటి ప్రాజెక్టుల అంశాలపై ప్రధానంగా చర్చిస్తారని సమాచారం.

**డెస్క్**

-----------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో ఈ రోజు, రేపు చలి తీవ్రత మరింత పెరుగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది. వచ్చే మూడు రోజులు కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాదారణ కంటే 4 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని పేర్కొంది. తెలంగాణ ఉత్తర, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో 5

నుంచి 8 డిగ్రీల సెల్సియస్, హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో 6 నుంచి 8 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హెచ్చరించింది.

**పీఎస్**

-----------------------

**గ్రామ పంచాయతీల సమావేశం**

యాదాద్రి భువనగిరి జిల్లాలో కొత్తగా ఎన్నికైన సర్పంచ్ లు, వార్డ సభ్యులు ఎల్లుండి ప్రమాణ స్వీకారం చేస్తారని జిల్లా కలెక్టర్ హనుమంత రావు తెలిపారు. ప్రమాణ స్వీకారం అయిన వెంటనే సమావేశం నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

**పీటీసీ - యాదాద్రి భువనగిరి**

-------------------------

**మహబూబాబాద్ జిల్లా**

మహబూబాబాద్ లో రేపు జరిగే జాతీయ లోక్ అదాలత్ లో పెండింగ్ కేసులను పరిష్కరిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శాలిని షాకెళ్ళి తెలిపారు. కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకునేందుకు ప్రయత్నించాలని తెలిపారు.

**పీటీసీ - మహబూబాబాద్**

----------------------------

**సిద్దిపేట జిల్లా**

సిద్దిపేట జిల్లాకు చెందిన జిల్లా, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు 25 మంది మహారాష్ట్రలోని నాసిక్ లో గల సయ్యాద్రి వ్యవసాయ క్షేత్రాల సందర్శనకు వెళ్లారు. జిల్లా కలెక్టర్ కె.హైమావతి వారు ప్రయాణిస్తున్న వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు.

**పీటీసీ - సిద్దిపేట**

-------------------------

**స్వనిధి రుణాలు**

జోగులాంబ గద్వాల్ జిల్లాలో వీధి వ్యాపారుల కోసం ఉద్దేశించిన స్వనిధి పథకాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ పథకం పేరును 'లోక్ కళ్యాణ్ మేళా 'గా మార్చి రుణాలు అందించడానికి మేళాలను ఏర్పాటు చేయాలని సంకల్పించింది.

**పీటీసీ – యాదాద్రి భువనగిరి**

------------------------

**పెద్దపల్లి జిల్లా**

పెద్దపల్లి జిల్లాలో అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉందని, దాని పంపిణీకి ట్రాకింగ్ యాప్ సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. యూరియా లభ్యతపై రైతులకు ఎలాంటి అపోహలు, అనుమానాలు అవసరం లేదని ఆయన అన్నారు.

**పెద్దపల్లి పీటీసీ**

-------------------------

**ఎరువుల ఆస్ లైస్ బుకింగ్ యాప్**

నల్గొండ జిల్లాలో ఎరువుల ఆన్ లైన్ బుకింగ్ యాప్ ను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఈ రోజు ప్రారంభించారు. రైతులు ఈ యాప్ ద్వారా తమకు అవసరమైన యూరియాను బుక్ చేసుకుని సమీప డిలర్ల వద్ద నుంచి పొందవచ్చని ఆయన చెప్పారు.

**పీటీసీ - నల్లగొండ**

--------------------

**బీఆర్ఎస్ సర్పంచులు**

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన బీఆర్ఎస్ మద్దతు సర్పంచులకు నాగార్జున సాగర్ నియోజకవర్గం హాలియాలో ఈ రోజు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మాజీ మంత్రి జగదీష్ రెడ్డి పాల్గొన్నారు.

**పీటీసీ నల్లగొండ**

--------------------------